సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 27 । నవంబర్ । 2023



పున్నమి పూజలు

జిల్లాలోని పంచారామక్షేత్రాలు పాలకొల్లు, భీమవరంలో కార్తీక పౌర్ణమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జ్వాలాతోరణం వెలిగించారు. 8లో ▸



ఆహ్లాదం.. గోదావరి విహారం

లాంచీలో గోదావరి నదిపై విహరిస్తూ పాపికొండల అందాలను ఆస్వాదించడం మధురానుభూతిని కలిగిస్తుంది. పాపికొండల యాత్ర ఆకట్టుకుంటోంది. 8లో ▸



దాతృత్వానికి ప్రతీక

దాతృత్వానికి ప్రతీక అగ్నికుల క్షత్రియులని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అన్నారు. తోకతిప్పలో కొపనాతి కృష్ణమ్మవర్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్టర్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు ఆదివారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 136 మంది సెక్టార్ అధికారులు, 136 మంది సెక్టార్ పోలీసు అధికారులను నియమించామని, వీరిపై గురుతర బాధ్యత ఉందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు వీరు విధుల్లో కొనసాగాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా, ఎన్నికల నిబంధనలు తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగంపై పెద్ద ఎత్తున స్వీప్ యాక్టివిటీ చేపట్టనున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని విషయాలపై ముందుగానే అంచనా వేసి నివేదికలను అందజేయాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక సెక్షన్ ఆఫ్ ఓటర్లను ఓటింగ్ చేయకుండా అడ్డుపడే వ్యక్తులు, సంఘటన, లా అండ్ ఆర్డర్ ఇబ్బందులు, మాకు ఈ పని చేస్తే గాని ఓటు వేయం అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ బి. శ్రీనివాసులురాజు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ బి.నారాయణరెడ్డి, తణుకు మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, డీఎల్‌డీఓ శివప్రసాద్ యాదవ్, డీఎస్పీలు పైడేశ్వరరావు, శరత్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫిషరీస్‌కి ఎక్సలెన్స్ అవార్డు



ముంబైలో అవార్డు అందుకుంటున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగ అభివృద్ధి, రొయ్యల ఉత్పత్తి తదితర అంశాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్‌కు అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ దక్కింది. ముంబైలో ఈనెల 21, 22 తేదీల్లో పీటుసీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో ష్రింప్ రిటైల్ సెమినార్ సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగ అభివృద్ధి, రొయ్యల ఉత్పత్తి, రిటైల్ రేట్స్, సీడీ, ఫీడ్‌లు, ప్రభుత్వ పనితీరుపై రఘురాం మాట్లాడారు. ఆక్వా రంగంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్న చొరవ, అందిస్తున్న ప్రోత్సాహం వల్లే ఆక్వా రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రికి ఆక్వా రంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న విషయాన్ని ఆదివారం ఆయన ఇక్కడ తెలియజేశారు.

అందుకే.. మళ్లీ జగనే కావాలి

నవరత్నాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపారు.. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారు.. ప్రజల ముంగిటకు పాలన కోసం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.. విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.. కులం, మతం, వర్గం చూడకుండా అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చుతున్నారు.. సామాజిక సాధికారతే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్నింటా అగ్రతాంబూలం ఇచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలుచేస్తూ పాలన సాగిస్తున్నారు.. అందుకే రాష్ట్రానికి జగనే అవసరమని జిల్లావాసులు నినదిస్తున్నారు.. ఆయన చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేస్తున్నారు..

జనం నోట.. ఒకే మాట

- పేదరికమే ప్రామాణికంగా పథకాలు
- 'పశ్చిమ'లో 25.95 లక్షల మందికి రూ.3,683.85 కోట్ల లబ్ధి
- సామాజిక సాధికారతకు పెద్దపీట
- జిల్లా నేతలకు కీలక పదవులు
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- సర్వేకు ప్రజల నుంచి అనూహ్య స్పందన
- సర్వత్రా సంతృప్తి వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు





కాళ్ల మండలం బొండాడపేటలో పథకాలను వివరిస్తున్న నాయకులు (ఫైల్)

వై ఏపీ నీడ్స్ జగన్

కార్యక్రమం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఇళ్లు	ఇప్పటివరకు సందర్శించినవి
భీమవరం	98,452	7,450
నరసాపురం	73,027	12,973
ఆచంట	65,804	1,613
పాలకొల్లు	98,080	6,769
తాడేపల్లిగూడెం	92,541	7,169
తణుకు	99,950	12,836
ఉండి	98,486	12,813

సాక్షి, భీమవరం: అమ్మఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, పింఛన్ కానుక, ఆసరా, చేయూత, ఆరోగ్యశ్రీ తదితర 33 పథకాల ద్వారా గతేడాది రికార్డుస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాలోని 25.95 లక్షల మందికి రూ.3,683.85 కోట్ల లబ్ధి చేకూరింది. వీరిలో ఒకే ఇంటిలో మూడు నాలుగు పథకాలకు పైగా అందుకుంటున్న వారు ఎందరో. శాసనమండలి చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఎమ్మెల్సీ, శెట్టిబలిజ, వక్ఫ్‌బోర్డు, సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్లు, డీసీఎంఎస్ చైర్మన్, టీటీడీ బోర్డు మెంబర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్, మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్లు తదితర కీలక పదవులను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులకు ఇచ్చి సామాజిక సాధికారత చేసి చూపించారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ.. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలు వివరిస్తూ రాష్ట్రానికి సీఎం జగన్ అవసరాన్ని తెలిపేందుకు చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ పథకాల ద్వారా అందిస్తున్న సాయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటా వివరిస్తున్నారు. సచివాలయ పరిధిలో చేకూరిన లబ్ధిని తెలిపే సంక్షేమ బోర్డులను ఆవిష్కరిస్తున్నారు. పాలనపై వలంటీర్లు చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,21,340 ఇళ్లకు గాను ఇప్పటికే 61,623 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా జగన్ పాలనలో తమకు జరిగిన మేలును ప్రజలే స్వయంగా ముందుకు వచ్చి నేతలు, అధికారులకు ఆనందంగా తెలియజేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ ఆదుకుంది



కిడ్నీల్లో రాళ్ల సమస్యకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు ఇచ్చారు. ఇంటికి వచ్చాక కూడా ఖర్చులకు రూ.3,500 అకౌంట్‌లో వేశారు. నా కుమారుడికి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోతే ఆరోగ్యశ్రీలో ఆదుకున్నారు. ఆసరా, చేయూత, రైతు భరోసా, సున్నావడ్డీ పథకాల సాయం అందుతోంది. గతంలో సర్పంచ్‌గా ఉన్నాను. అప్పటికంటే జగన్ ప్రభుత్వం వచ్చాక అందరికీ బాగుంది.

– బొమ్మిడి వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ అప్పారావుపేట, ఆకివీడు మండలం

మాట ఇచ్చినట్టే రుణమాఫీ



అధికారంలోకి వచ్చాక నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పినట్టుగానే జగన్ మా డ్వాక్రా రుణాలను చెల్లిస్తున్నారు. ఎన్నికలకు ముందు మా సంఘం రూ.9.55 లక్షలు రుణం తీసుకుంది. మూడు విడతల్లో రూ.7.10 లక్షలు మాఫీ చేశారు. మిగిలినది త్వరలో మాఫీ చేయనున్నారు. గతంలో రుణమాఫీ పేరుతో చంద్రబాబు వంచిస్తే సీఎం జగనన్న ఇచ్చిన మాటను నిలుపుకున్నారు.

– తమరడ వహీదా, డ్వాక్రా మహిళ, కొవ్వాద అన్నవరం, భీమవరం రూరల్

సచివాలయ ఉద్యోగం వచ్చింది



నాకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో ప్రైవేట్‌గా డిగ్రీ, ఎంఏ, బీఈడీ చేశాను. ప్రైవేట్ టీచర్‌గా చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాశాను. ఇక అవకాశం లేదనుకుంటున్న సమయంలో సీఎం జగన్ సార్ సచివాలయ వ్యవస్థను తీసుకురావడం నిరుద్యోగులకు వరమైంది. ఈ పరీక్షలు రాసి సచివాలయంలో మహిళ పోలీస్‌గా ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది.

– తాళాబత్తుల సుబ్బలక్ష్మి, సచివాలయ ఉద్యోగి, నరసాపురం

ఒకటో తారీఖునే పింఛన్



గతంలో పింఛన్ కోసం కాళ్లీడ్చుకుంటూ రెండు కిలోమీటర్లు వెళ్లేవాణ్ణి. ఇప్పుడు ఒకటో తారీఖు తెల్లారకుండానే వలంటీర్ అబ్బాయికి ఇంటికి వచ్చి రూ.2,750 ఇస్తున్నారు. బియ్యం కూడా ఇంటి వద్దనే అందిస్తున్నారు. రేషన్ బియ్యం, పింఛన్ డబ్బులు నాకు, ముసలిదానికి సరిపోతున్నాయి. మొన్నీమధ్యనే మా సచివాలయం వద్దకు పెద్ద డాక్టర్లు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి మందులిచ్చారు. ఇలాంటి పాలన ఎన్నడూ చూడలేదు.

– మల్రి బుల్లియ్య, కొత్త నవరసపురం, నరసాపురం రూరల్



ఏళ్ల నాటి సొంతింటి కల సాకారం

అద్దె ఇంట్లో ఉంటూ సొంతింటి కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. జగనన్న వచ్చాకే మాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. భీమవరం మండలం శ్రీరాంపురం జగనన్న కాలనీలో ప్రభుత్వ సాయంతో ఇంటిని నిర్మించుకున్నాం. ఇటీవల నా భర్తకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు. నాకు అమ్మఒడి, ఆసరా డబ్బులు వస్తున్నాయి. దివ్యాంగురాలైన నా కుమార్తెకు పింఛన్ వస్తోంది. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ధరాలకోట పద్మావతి, వెంప, భీమవరం రూరల్

అమ్మఒడితో చదువు భారం తగ్గింది



బాబు పుట్టిన ఏడాదికే నా భర్త చనిపోయారు. చాలాకాలం పింఛన్ రాక ఇబ్బంది పడ్డాను. జగనన్న వచ్చాక పింఛన్ సాయం పెరిగింది. అమ్మఒడి, కాపునేస్తం మంజూరయ్యాయి. మా అబ్బాయికి స్కూల్‌లోనే రుచికరమైన భోజనం పెడుతున్నారు. పుస్తకాలు, యూనిఫాం, షూలు ఇలా అన్ని ప్రభుత్వమే ఇస్తుండటంతో చదువు భారం తగ్గింది. ఇలా పలురకాలుగా మేలు చేస్తున్న జగన్‌కు రుణపడి ఉంటాం.

– కలవల నాగవెంకటలక్ష్మి, మేడపాడు, యలమంచిలి మండలం

వెలుగులు నింపిన జగన్



దివంగత సీఎం వైఎస్సార్ స్థలం ఇవ్వగా సీఎం జగన్ ఇల్లు మంజూరు చేయడంతో 2021లో ఇల్లు కట్టుకున్నాను. నా సొంతింటి కల నెరవేరింది. మా చిన్నమ్మాయికి రెండేళ్లు అమ్మఒడి వచ్చింది. నా భార్యకు కాపునేస్తం మంజూరైంది. ఇలా ఆ తండ్రీ, కొడుకుల సాయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు పిల్లల చదువులు పూర్తయ్యాయి. అందుకే జగనన్నే మళ్లీ సీఎంగా రావాలి. ఆయన మా జీవితాల్లో వెలుగులు నింపారు.

– అరవ లింగయ్యనాయుడు, మేడపాడు, యలమంచిలి మండలం

ఆరాధ్య దైవం అంబేడ్కర్



మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, చిత్రంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: దళిత జాతి ఆరాధ్య దైవం అయిన బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల దళితులు రాజకీయ పదవులు పొందుతున్నారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక తాలూకా సెంటర్‌లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సొంత నిధులతో చేపట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఆదివారం మోషేన్‌రాజు శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మోషేన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు లభించిందన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడారు.

రూ.480 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ





తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, భీమవరంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున రూ.480 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి కొట్టు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయులంతా గర్వించదగ్గ రోజు నవంబర్ 26 అన్నారు. ఎందరో ప్రాణత్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని, దృఢమైన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామన్నారు. రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ కవచంగా నిలిచిందన్నారు. 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్నారని, బేస్‌మెంట్ భాగంలో మరో 80 అడుగుల పీఠంతో 205 అడుగుల్లో దేశంలోనే ఎత్తయిన విగ్రహం ఏర్పాటు చేయనున్నారన్నారు. 2014లో చంద్రబాబు హయాంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన ఐదెకరాల స్థలం తుప్పలతో నిరుపయోగంగా మారిందన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చంద్రబాబు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, బొద్దు సాయిబాబా, మానికొండ వెంకటేశ్వరరావు, కర్నాటి కన్నయ్య, కొట్టు విశాల్, మేడపాటి జనార్దనరావు, మేడపాటి చెల్లారెడ్డి, పత్సమట్ల సావిత్రి, సింగం సుబ్బారావు, బోశం రమణ, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, సీరుకొండ పండు, చామన సూర్యచంద్రరావు, కొడే సత్య శ్రీనివాస్, ఆశోక్, ప్రసద్, మారిశెట్టి రమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి వ్యక్తి జీవన విధానానికి రాజ్యాంగం ప్రామాణికంగా నిలుస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం స్ఫూర్తి అందరికీ తెలియాలన్నారు. ఆర్డీఓ బి. శ్రీనివాసులు జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనం రాజ్యాంగం అన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధూర్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

భీమవరం: స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ విశిష్టతను తెలిపారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్తీకం.. దేదీప్యమానం



కాళ్లకూరులో స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీవారి నామం, శంఖు చక్రాల ఆకృతిలో భక్తులు దీపాలు వెలిగించారు. ఈఓ మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. – కాళ్ల

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

కైకలూరు: కొల్లేరు జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా టూరిజం ఇన్‌చార్జి ఆఫీసర్ డి.సూర్యతేజ అన్నారు. కుటుంబసమేతంగా ఆయన ఆటపాక పక్షుల కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టాక్ పక్షుల విన్యాసాలను వీక్షించారు. అనంతరం పక్షుల నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొల్లేరుకు వలస పక్షులు రాకా ఎక్కువయ్యిందన్నారు. పక్షుల కేంద్రంలో మరిన్ని కృత్రిమ స్టాండ్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో టెంపుల్ టూరిజంతో పాటు ఏకో టూరిజం అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. కొల్లేరు చుట్టూ ఎకో సెన్సిటివ్ బఫర్ జోన్ పరిధిపై అధ్యయనం చేస్తానన్నారు. కొల్లేరులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. కొల్లేరు పరిరక్షణలో అటవీ శాఖ పాత్ర అభినందనీయమన్నారు. డెప్యూటీ ఫారెస్టు రేంజర్ జయప్రకాష్, ఫారెస్టు బీటు ఆఫీసరు కావడి వెంకన్న, ఫారెస్టు సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రోప్ స్కిప్పింగ్ పోటీకి నన్నయ్య విద్యార్థిని



తాడేపల్లిగూడెం: జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు నన్నయ్య ప్రాంగణంలో బీ ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న వి.న్యూరోసీ ఎంపికయ్యారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల భీమవరం డీఎన్నార్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. న్యూరోసీని కళాశాల ప్రిన్సిపాల్ టి.అశోక్, డిపార్టుమెంటు కోర్సు కో–ఆర్డినేటర్ లిఖిత తదితరులు అభినందనలు తెలిపారు.

అగ్నిగుండంలో పడడంతో బాలుడికి గాయాలు



నిప్పుల్లో పడి గాయపడిన బాలుడు

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో వేంచేసియున్న శ్రీ వీరభద్రస్వామి కల్యాణం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో బాలుడు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్వామి కళ్యాణం సందర్భంగా అగ్నిగుండంలోకి అయ్యప్ప మాలధారులు దిగి నిప్పులు తొక్కడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా బూసి శివనాగరాజు తన కుమారుడైన యశ్వంతకుమార్(9)ను భుజంపైన ఎక్కించుకొని ఉదయం 10.30 గంటల సమయంలో అగ్నిగుండంలో నిప్పులు తొక్కుతుండగా తోపులాటలో భుజంపై ఉన్న యశ్వంత్ జారీ నిప్పుల్లో పడిపోయాడు. దీంతో అతనికి ఎడమకాలు, ఎడమచేయి, పొట్టకు ఎడమవైపున కాలింది. క్షతగాత్రుడిని హుటాహుటిన నూజివీడులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

పెనుగొండ: పెనుగొండలో శనివారం అదృశ్యమైన ఇరగవరం మండలం కంతేరుకు చెందిన బాలిక ఆచూకీ ద్వారకా తిరుమలలో లభ్యమైంది. శనివారం పెనుగొండ పాఠశాల నుంచి వస్తూ పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో వద్ద బాలిక అదృశ్యమైంది. ఎంతకూ రాకపోవడంతో కనిపించడం లేదంటూ పెనుగొండ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించడంతో పాటు, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో ద్వారకా తిరుమల పోలీసులు ఆదివారం సాయంత్రం బాలికను గుర్తించి, పెనుగొండ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కథ సుఖాంతమైంది. ద్వారకా తిరుమల వెళ్లడానికి కారణాలు ఇంకా తెలియ రాలేదు.

ఆహ్లాదభరితం.. గోదావరి విహారం

- మధురానుభూతి కలిగించే పాపికొండల యాత్ర
- బోటు ప్రయాణానికి పెరుగుతున్న యాత్రికుల సంఖ్య



గోదావరి నదిపై ప్రయాణిస్తున్న బోటు

బుట్టాయగూడెం: ఒక పక్క గోదావరి గలగలలు... మరో పక్క గిరిజన గ్రామాల అందాలు.. ఆహ్లాదభరితం పాపికొండల విహారం. లాంచీల్లో గోదావరి నదిపై విహరిస్తూ పాపికొండల అందాలను ఆస్వాదించే అనుభూతి మాటల్లో చెబితే చాలదు. గోదావరి నదిపై ప్రయాణించి ఆ అనుభూతిని పొందాల్సిందే.

ఎత్తయిన కొండల మధ్య ప్రయాణం

గోదావరి నదిలో పాపికొండల యాత్ర మధురానుభూతిని మిగులుస్తుంది. ప్రకృతి రమణీయమైన సోయగాలతో ఎత్తయిన కొండల మధ్య గలగలా ప్రవహించే గోదావరి అలలపై బోటు ప్రయాణం ఎంతో హాయినిస్తుంది. సెలవులు వస్తే పాపికొండలను సందర్శించేందుకు ఉత్సాహం కనబరిచేవారు ఎంతోమంది ఉన్నారు. కార్తీకమాసం వచ్చిందంటే పాపికొండల విహారయాత్రకు వెళ్లే యాత్రికుల సంఖ్య అధికంగా ఉంటుంది. గోదావరి తీరప్రాంతాలతో పాటు పాపికొండల విహారానికి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివస్తుంటారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

పాపికొండల్లో ప్రయాణానికి లాంచీ పాయింట్లు

పాపికొండల విహారయాత్రకు వెళ్లాలంటే రాజమండ్రి మీదుగా అల్లూరి జిల్లా దేవీపట్నం గండిపోచమ్మ గుడి సమీపంలోని లాంచీ పాయింట్ ఉంది. గండిపోచమ్మ తల్లి లాంచీ పాయింట్ నుంచి పేరంటాలపల్లి వరకూ సుమారు 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలి. లాంచీల్లో ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకిస్తూ సుమారు 2 గంటల పాటు ప్రయాణం చేయాలి. ప్రస్తుతం ఇక్కడ టూరిజంకు చెందిన బోటు ఒకటి, ప్రైవేటు బోట్లను పాపికొండల విహారయాత్రకు వెళ్ళే వారి కోసం ఏర్పాటు చేశారు.

గోదావరిలో ప్రమాదకర ప్రాంతాలు

దేవీపట్నం, పాపికొండల నడుమ అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో గోదావరి ఎప్పుడూ సుడులు తిరుగుతూ ఉంటుంది. ఏలూరు జిల్లా వాడపల్లి, అల్లూరి జిల్లా మంటూరు వద్ద నదిలో అధికంగా సుడులు తిరుగుతూ ఉంటాయి. అయితే కచ్చులూరు మందం సమీపంలో అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ఉంటాయి. ఆ ప్రదేశంలో నదికి ఇరువైపులా కొండలు ఉండి ప్రవాహం ఎక్కువగా ఉండటమే ఈ సుడులకు కారణమని పలువురు చెబుతున్నారు.

భద్రతా చర్యలు చేపట్టిన ప్రభుత్వం

గోదావరి నదిలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టింది. గతంలో కచ్చులూరు వద్ద బోర్డు ప్రమాద సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పటిష్టమైన చర్యలతో పాపికొండల ప్రయాణానికి భద్రత కల్పించింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ ఈ ఏడాది కూడా పాపికొండల విహారానికి అనుమతినిచ్చింది. ప్రతి బోటులో లైఫ్ జాకెట్లతో పాటు లైఫ్ బోయా, ఆక్సిజన్ సిలిండర్‌లు, ఫైర్ జాకెట్‌లు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. ప్రయాణికులు, పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా రెవెన్యూ, పోలీసు, టూరిజం, ఇరిగేషన్ సిబ్బంది పర్యవేక్షణలో లాంచీ పర్యటన సాగేలా నిబంధనలు కఠినతరం చేసింది. లైఫ్ జాకెట్‌లు తప్పనిసరిగా ధరించడంతోపాటు లైఫ్ బాయ్‌లు, ఫైర్ అలారం, శాటిలైట్ ఫోన్‌లు, వాకీటాకీలను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ళతో లైఫ్ బోట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు శాటిలైట్ ఫోన్ ద్వారా కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. లాంచీల నాణ్యతను పరిశీలించేందుకు నిరంతరం ఫిట్‌నెస్ టెస్ట్‌లు కూడా చేస్తున్నారు.

ఆక్వా షాపులో చోరీ



ఆకివీడు: స్థానిక హైస్కూల్ సమీపంలో శ్రీ చక్ర ఆక్వా ఫీడ్స్ షాపులో శనివారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగిందని ఎస్‌ఐ బీ.నాగబాబు ఆదివారం చెప్పారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షాపు తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని రూ.1.90 లక్షలు, సీసీ కెమెరాలు దొంగిలించుకుపోయినట్లు తెలిపారు. షాపు యజమాని దాట్ల ప్రతాప్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోడిపందేలపై దాడి

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసినట్లు కాళ్ళ ఎస్సై వీరభద్రం ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుపాడులో కోడిపందేలు నిర్వహిస్తుండగా దాడి చేసి ఏడుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి 7 కోడిపుంజులు, 2 కోడి కత్తులు, 20 మోటర్ సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లతో పాటు రూ.14,330 స్వాధీనం చేసుకున్నారు.

దాతృత్వానికి ప్రతీక అగ్నికుల క్షత్రియులు

ఎంపీ మోపిదేవి వెంకటరమణ



తోకతిప్పలో స్వర్గీయ కొపనాతి కృష్ణమ్మ వర్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్ : ఎంతో ప్రసిద్ధిగాంచిన అంతర్వేది ఆలయ నిర్మాణానికి స్వర్గీయ కొపనాతి కృష్ణమ్మ వర్మ అప్పట్లో ఎంతో ఖర్చు చేశారని, దాతృత్వ గుణాలకు, దైవాత్వానికి ప్రతీక అగ్నికుల క్షత్రియులని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో రిటైర్డ్ జడ్జి మైలా రామ్మూర్తి వర్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు అధ్యక్షతన ఆదివారం అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ వర్మ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ 18వ శతాబ్దంలో కొపనాతి కృష్ణమ్మవర్మ నౌకాయానం ద్వారా రంగూన్, బర్మా వెళ్లి వజ్రాలు, ముత్యాల వ్యాపారాలు చేశారని, తన ఆస్తితో అంతర్వేది ఆలయాన్ని నిర్మించారన్నారు. మల్లాడి సత్యలింగ నాయకర్ ఎంఎస్ఎన్ చారిటబుల్ ట్రస్టుకు 1860 ఎకరాలు దానం చేశారన్నారు. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అగ్నికుల క్షత్రియుడు పెనుబోతు గజేంద్రుడు నిర్మించారన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి కాకుండా ఉన్నత విద్యనభ్యసించేలా తీర్చిదిద్దాలన్నారు. పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు నేడు ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయం, వాడపల్లి శ్రీ వేంకటేశ్వర ఆలయాలను నిర్మించిన కొపనాతి కృష్ణమ్మ వర్మ, పినబోతు గజేంద్రుడు మహానుభావులని ప్రతి గ్రామాన వారి విగ్రహాలు ఆవిష్కరించి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణరావు, జెడ్పీటీసీలు తిరుమాని బాబుజీ, మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఉషోదయ హాస్పటల్స్ ఎండీ నాగిడి హరిశ్చంద్రప్రసాద్, బొమ్మిడి నాయకర్, సర్పంచ్ తిరుమాని వరలక్ష్మి శ్రీనివాస్, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, కొపనాతి శ్రీనివాసవర్మ, కొపనాతి లక్ష్మీనారాయణ, వాతాడి నాగరాజు, తిరుమాని సుబ్బరాజు, తిరుమాని వెంకటరామారావు, బొమ్మిడి శ్రీను, కొపనాతి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామంలో కార్తీక పున్నమి పూజలు





క్షీరారామలింగేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకస్వాములు, ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వేకువజామున కాలువస్నానాలు ఆచరించిన మహిళలు కాలువ గట్టున కార్తీకదీపాలను వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నూతన వధువులు పువ్వు, పిండె, 11 కాయలతో ఉన్న అరటిపళ్లు, కొబ్బరి బొండాలు, బియ్యం, కందగొడుగు, పసుపు గొడుగులతో స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో దీపాలు వెలిగించారు. అలాగే సాలగ్రామ, దీపం, వస్త్రం, గోదానాలు చేశారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి స్వామివారిని దర్శించుకుని ఆరుబయట పూజలు చేసి పున్నమి చంద్రుడిని అద్దంలో చూసి అనంతరం ప్రసాదం స్వీకరించారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో, ధర్మపరిరక్షణా సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న ఆధ్వర్యంలో 1984 పదో తరగతి పూర్వ విద్యార్థులు ప్రసాదం పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వీ రమణ క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి పాల్గొన్నారు. దాతలు శ్రీ వేంకటేశ్వర మెడికల్ హాల్, మంతెన రామారావు కుటుంబ సభ్యులు, క్షీరారామలింగేశ్వరస్వామి సమితి సభ్యుల సహకారంతో నిత్యాన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో జ్వాలా తోరణం

క్షీరారామరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం వెలిగించారు. ఆదివారం రాత్రి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కృత్తికా నక్షత్రం కావడంతో కార్తికేయుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో జ్వాల వెలిగించి ఆలయంలో ప్రదక్షిణలు చేసి ఆలయ సింహ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన జ్వాలా తోరణం వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జ్వాలా తోరణం కార్యక్రమాన్ని తిలకించారు.

కార్తీక పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఉమా సోమేశ్వర స్వామి



స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పంచారామ క్షేత్రానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శ్రీ ఉమా సోమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో స్వామికి అభిషేకాలు, కార్తీక దీపారాధనలు చేశారు. ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఆదివారం రాత్రి దేవస్థానంలో కార్తీక దీపాలతో దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీరాంపురంలో వేంచేసిన జగన్మాత శ్రీ కనకదుర్గ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి దీపారాధన పూజలు నిర్వహించారు. దేవస్థానం లోపల బయట కార్తిక దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి పూజ నిర్వహించి ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు





అత్తిలిలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాద దృశ్యం, గాయపడిన మహిళ

అత్తిలి: రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం అత్తిలి బస్‌స్టేషన్ ఎదురుగా ఈ సంఘటన జరిగింది. ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి మండలం ఉనికిలికి చెందిన పెన్మెత్స సురేష్‌రాజు మేనత్త ఉప్పలపాటి పార్వతిని బైక్‌పై ఎక్కించుకుని అత్తిలి వెళ్లాడు. బస్‌స్టేషన్ వైపుకి వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బస్‌స్టేషన్ ఇన్‌గేట్‌ను ఆనుకుని ఉన్న ఫర్నీచర్ షాపు వైపు దూసుకెళ్లి షెడ్డును ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో పార్వతీ, సురేష్ రాజుతో పాటు.. ఫర్నీచర్‌షాపు మెట్లపై ఉన్న పెనుమంట్ర మండలం పంపనవారిపాలెంకు చెందిన వాసంశెట్టి లక్ష్మి, నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన సీహెచ్ గీతా సాయి శ్రీలక్ష్మిలు గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో తణుకు, భీమవరం ఆసుపత్రులకు తరలించారు. వాసంశెట్టి లక్ష్మిని మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాంబాబు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జట్లు



అంతర జిల్లాల పోటీల్లో సత్తా చాటిన జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు మరోసారి సత్తా చాటాయి. ఈ నెల 24 నుంచి 26 వరకూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఎస్‌జీఎఫ్ అండర్–17 అంతర జిల్లాల బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న బాలుర జట్టు ఫైనల్‌లో కృష్ణా జట్టుతో తలపడి 58–43 స్కోర్‌తో ఓటమి చెంది ద్వితీయ స్థానంలో నిలిచింది. సెమీస్‌లో ఓడిన బాలికల జట్టు ఈస్ట్‌గోదావరి జట్టును 53–27 స్కోర్‌తో ఓడించి తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. పోటీల్లో ప్రతిభ చాటిన బాలుర విభాగంలో ఎస్.కిషోర్ (మార్టేరు) ఏ.ఈశ్వర్‌తేజ (ఏలూరు) సందీప్ (మార్టేరు స్టాండ్‌బై), బాలికల విభాగంలో ఏలూరు నుంచి ఏ రుత్విక, జి.పూజిత, డి.సాయిభవాని(స్టాండ్‌బై)లను ఎంపిక చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ డీబీ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు, కోశాధికారి కె.మురళీకృష్ణ అభినందించారు.

మామ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్ : కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో పిల్లనిచ్చిన సొంత మామనే హత్య చేశాడు అల్లుడు. పెదవేగి మండలం అంకన్నగూడెంలో ఈ ఘటన జరగగా.. 24 గంటలు గడవకుండానే పోలీసులు ఈ కేసును ఛేదించారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఏలూరు కోటదిబ్బలోని పెదవేగి సర్కిల్ కార్యాలయంలో నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ వివరాలు వెల్లడించారు. పెదవేగి మండలం అంకన్నగూడెంకు చెందిన టైలర్ మరీదు సీతారామాంజనేయులు తన కుమార్తె లక్ష్మిని అదే గ్రామానికి చెందిన కట్టా సుబ్బారావు కుమారుడు నవ్యసాయికి ఇచ్చి 3 ఏళ్ల క్రితం వివాహం చేశారు. లక్ష్మి, నవ్యసాయికి ఇద్దరు పిల్లలు పుట్టారు. వివాహమైన సంవత్సరం నుంచే దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తటంతో ఇరు కుటుంబాల్లో గొడవలు చోటుచేసుకున్నాయి. నవ్య సాయి భార్యను అధిక కట్నం కోసం వేధించేవాడు. ఈ విషయంలో అతని తల్లిదండ్రులు ప్రోత్సహించేవారు. పెద్దల్లో పెట్టి మాట్లాడుకుందామని లక్ష్మి తండ్రి కుమార్తెను సముదాయించాడు. ఈ నెల 25 ఉదయం సీతారామాంజనేయులు వస్తుండగా గ్రామంలోని పాండురంగస్వామి గుడి వద్ద నవ్యసాయి, అతని తండ్రి సుబ్బారావు, తల్లి విజయలక్ష్మి అలియాస్ విజయకుమారి అడ్డగించారు. నవ్యసాయి తన వెంట తెచ్చుకున్న కత్తితో సీతారామాంజనేయులు గొంతులో పొడవగా అతని తల్లిదండ్రులు గట్టిగా పట్టుకున్నారు. అతను రక్తం మడుగులో పడిపోవటంతో నిందితులు పరారయ్యారు. ఈ ఘటన చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సీతారామాంజనేయులను వెంటనే ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఊరు విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న నిందితులను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

తరతరాలుగా శ్రీవారి సేవలో తరిస్తున్నాం



సన్నిధి కిషోర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): తరతరాలుగా తమ వంశస్తులు తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడి సేవలో తరిస్తున్నారని తిరుమల తిరుపతి దేవస్థానం సన్నిధి గొల్ల సన్నిధి కిషోర్ అన్నారు. ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో ఆదివారం ఉదయం ఏలూరులో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా యాదవ యువసమితి వ్యవస్థాపకుడు కాట్రు బాలకృష్ణ, నాయకులు కాట్రు విజయ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక గ్జేవియర్ నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వామి తొలి దర్శనం, మలి దర్శనంతో పాటు హారతి, తీర్థం, స్వామి వారికి నివేదించే నైవేద్యం, తోమాల సేవ వంటి కార్యక్రమంలో పాల్గొనే భాగ్యం కలిగిందన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిలకలపల్లి కట్లయ్య



ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేయడం వల్ల రజకులకు ప్రయోజనం చేకూరిందని రజక జన సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల సమస్యల పట్ల నిరంతరం స్పందిస్తున్న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిలకు ఆయన ధన్యవాదాలు తెలియజేసారు. జిల్లాలోని జిల్లా పంచాయతీ అధికారులు రజకుల వృత్తి చెరువులకు సంబంధించి పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. క్షేత్ర స్థాయిల్లో వీటిని అమలు చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించడం వల్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా రజకులు అనేక సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. ఆకివీడు మున్సిపాల్టీలో 50 సంవత్సరాలుగా వృత్తి చేసుకుంటున్న రజకుల చెరువుకు మున్సిపాలిటీ లీజు ఆపినందు వల్ల సమస్య తలెత్తిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్ళడంతో ఆమె స్పందించి తగు ఆదేశాలు జారీ చేయనున్నట్లు చెప్పారన్నారు. ఇదే విధంగా తాడేపల్లిగూడెం మండలం మాధవరం, భీమవరం మండలం కొమరాడ, వీరవాసరం మండలం నవుడూరు రజక చెరువుల విషయంపై పశ్చిమ డీపీఓ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగిరాజు, విటాల శ్రీనివాసరావు, కొమ్మంటి మురళీ, కుమ్మరికుంట వీర్రాజు, పొన్నాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా వాకర్స్‌కు అవార్డులు



అవార్డులు అందుకున్న మహిళా వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ సేవలను గుర్తించి వారికి నిడదవోలు జిల్లా కాన్ఫరెన్స్‌లో జిల్లా గవర్నర్ కృష్ణ మూర్తి ఐదు అవార్డులను అందజేశారు. ఉత్తమ అధ్యక్షురాలు, జోన్ చైర్‌పర్సన్‌గా వనచర్ల విజయలక్ష్మికి, ఉత్తమ కార్యదర్శిగా కుంట్ల కనకదుర్గ, ఉత్తమ క్లబ్, సపోర్టింగ్ క్లబ్ అవార్డులు అందుకున్నారు. పట్టణ వాకర్స్ అభినందనలు తెలిపారు.

కవి ప్రసాద్‌కు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవి ప్రసాద్

తణుకు: ప్రపంచ ప్రసిద్ధ సాహితీ సాంస్కృతిక సంస్థ పట్టాభి కళాపీఠం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ పురస్కారం అందుకున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టంపై ఆయన రాసిన గ్రహణం వీడిన చంద్రబింబం అనే కవిత జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో వీఎస్‌వీ ప్రసాద్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు డాక్టర్ రామరాజు, శ్రీనివాసరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

పంచారామ క్షేత్రాలకు తరలి వెళ్లిన బస్సులు



బస్సుల్లో బయల్దేరుతున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పంచారామ దర్శిని యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు, మూడు పల్లె వెలుగు బస్సులు ఆదివారం రాత్రి తరలి వెళ్లాయి. అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరంలో కొలువైన పరమేశ్వరుని దర్శనం అనంతరం సోమవారం రాత్రి పట్టణానికి బస్సులు చేరుకుంటాయని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. టికెట్ ధర సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1,100, పల్లె వెలుగు బస్సుకు రూ.700 మాత్రమేనని తెలిపారు. డిసెంబర్ 3, 10 తేదీల్లో ఆదివారం రాత్రి 9 గంటలకు బస్సులు బయల్దేరుతాయని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి

'గూడెం' ఆర్డీవో కె.చెన్నయ్య



సభలో పాల్గొన్న ఆర్డీవో చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. వీరంపాలెంలో జరిగిన సభలో ఆర్డీవో చెన్నయ్య పాల్గొని ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ముద్ర యోజన, విశ్వకర్మ, పోషణ అభియాన్, పీఎం కిసాన్ వంటి పథకాలపై మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో పౌరులందరికీ సమాన హక్కులు

తాడేపల్లిగూడెం: ప్రపంచంలో అతిపెద్ద, అత్యుత్తమైన రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించడం ద్వారా దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కుతున్నాయని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఆదివారం నిట్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్పతనం అన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్నారు. ఉన్నత విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ రాజ్యాంగ పితగా ఖ్యాతి గడించారన్నారు. అంబేద్కర్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంధ్యారాణి, సాయిరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: తాలూకా ఆఫీస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రసంగిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్



తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి

తాలూకా ఆఫీసు సెంటర్‌లో..

తాడేపల్లిగూడెం అర్బన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తాలూకా ఆఫీసు సెంటరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మార్కెట్ యార్డు చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, దళితులకు ఆరాధ్య దైవంగా అంబేద్కర్ నిలిచారన్నారు. ఆయన ఆధ్వర్యాన రచించిన భారత రాజ్యాంగం ఆయా వర్గాల ప్రజలకు రక్షణగా నిలించిందన్నారు. కార్యక్రమంలో కొమ్ముగూడెం, నవాబ్ పాలెం సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్ర కుమార్, జడ్డు హరిబాబు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, చామన సూర్యచంద్రరావు, కోడే శ్రీనివాస్, వెంకట్రావుపాలెం సర్పంచ్ సంసేను, జోగేంద్ర, మహిళలు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

తణుకు అర్బన్: తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి మాట్లాడుతూ భారత పౌరుల హక్కులు, చట్టాలు వంటి అంశాలతో సమాజంలో పౌరుల బాధ్యతలను రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చక్కగా రూపొందించారని అన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది సూరంపూడి కామేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్ కుమార్, జిలానీ, కట్టా కిషోర్, తలపాకుల రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవలు మరువలేనివి

అత్తిలి: దేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం అత్తిలి మెయిన్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేత, సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్ కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, మండల సోషల్ మీడియా కన్వీనర్ యళ్ల హనోక్ కుమార్, సేవాదళ్ అధ్యక్షుడు కంకటాల సతీష్, పార్టీ నాయకులు సబ్బితి రాజేష్, ఆకుల చినబాబు, బుంగా పద్మారావు, ఇల్లూరి సంపదరావు, పొట్ల నరేష్, వూడిమూడి ప్రసాద్, ఉల్లంకి రాజేష్, పల్లిచంటి, రంభ రాంబాబు పాల్గొన్నారు. అత్తిలి చినపేటలో అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పల్లి చంటి, కోట సూరిబాబు, పి.వినయ్‌బాబు, పొట్ల నరేష్‌బాబు, మెండి శ్రీనివాస్, దొడ్డి సురేష్, కోనాల ప్రభ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని దళిత హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం స్థానిక కపర్ది భవనంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు కంకట రత్నకుమార్, సీపీఐ టౌన్ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజు, ఎస్కే మస్తాన్, రవికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తణుకు మండలంలో..

తణుకు టౌన్: రాజ్యాంగ దినోత్సవాన్ని తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండపాక గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, ముద్దాపురంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, కమిటీ అధ్యక్షుడు టి.సత్యనారాయణ ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. ముళ్లపూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రచనకు అంబేద్కర్ సేవలను కొనియాడారు.

మహిళా కళాశాలలో..

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తణుకు మహిళా కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

ఇరగవరం: మండలంలోని గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, ఎ.శ్రీనివాస్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగాన్ని ఆమోదించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కంకిపాటి శ్రీనివాస్, చేబ్రోలు స్వరాజ్యం గుడిమెట్ల ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు: స్థానిక డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బేసిక్ స్కూలులో విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ నిలువెత్తు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగంపై నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జట్లపాలెంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఆకుతీగపాడు, ముదునూరు, అలంపురం, ప్రత్తిపాడు గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

వైభవంగా జ్వాలా తోరణం



మీనవిల్లూరులో వెలుగుతున్న జ్వాలా తోరణం

పెంటపాడు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మీనవిల్లూరు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అనువంశిక ధర్మకర్త పెమ్మరాజు సూర్యనరేంద్ర ఆధ్వర్యాన భారీ సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని అభిషేకించారు. రాత్రి జ్వాలా తోరణం వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కె.పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి ఆలయంలో ఫిట్ పర్సన్ శివశంకర్ ఆధ్వర్యాన జ్వాలా తోరణం వెలిగించారు. అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠిలు ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజించారు. పెంటపాడు పెద్ద శివాలయం, దర్శిపర్రు పార్వతీ బ్రహ్మలింగేశ్వర స్వామివారి ఆలయం, బోడపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

1న కోటి దీపోత్సవం

పెంటపాడు: కార్తీక మాసం పురస్కరించుకుని చింతపల్లి పార్వతీ సమేత భీమేశ్వర స్వామివారి ఆలయంలో డిసెంబర్ 1న సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు పేరిచర్ల కిరణ్‌కుమార్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

'ఏపీలో అడుగు పెట్టే అర్హత మోదీకి లేదు'



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తణుకు: ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని నరేంద్ర మోదీకి ఏపీలో అడుగు పెట్టే అర్హత లేదని సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు పీవీ ప్రతాప్, బొద్దాని నాగరాజు విమర్శించారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యాన మోదీ తిరుపతి రాకను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. తిరుపతి ఎన్నికల్లో ఏపీకు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయని నరేంద్ర మోదీకు ఏపీలో అడుగు పెట్టే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి, బొద్దాని నాగరాజు, బి.కిషోర్, బి.అప్పారావు, ఎస్.రాధాకృష్ణ, సీతారామయ్య, గోవిందరాజు, కడలి వీర్రాజు, గంగాధర్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఆర్ గోయెంకా పూర్వ విద్యార్థుల సమావేశం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1985–88 సంవత్సరంలో చదివిన బీకాం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని ఎంవీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ వేదికగా నిలిచింది. 35 సంవత్సరాల అనంతరం స్నేహితులు ఒక్కచోట కలిసి ముచ్చట్లు చెప్పుకున్నారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. చదువుకున్న రోజులు గుర్తుగా జ్ఞాపికలు అందుకున్నారు. పీకే అగర్వాల్, మేనా నానాజీ, పరిమి రాజారావు, అందే మల్లికార్జునరావు, పోతుల వెంకట రమణ, బాకా కోటేశ్వరరావు, కొప్పిశెట్టి వెంకట్రాజు, ఎం.జగదీష్, గోపి రామావతారం, గోపిశెట్టి శ్రీనివాస్, వెజ్జు శ్రీను, భూపతి శ్రీనివాస్, కె.మల్లికార్జునరావు, పి.పురుషోత్తం, బోడపాడు సత్యనారాయణ, కుదుళ్ళ సత్యనారాయణ, టీబీవీ ఆంజనేయులు, చల్లంచర్ల శరభేశ్వరరావు, పి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

కరాటేలో పతకాలు

తాడేపల్లిగూడెం: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని షికో షాటోకాన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఆదివారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ వయస్సుల కటా విభాగంలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. కటా విభాగంలో ఎ.వినయ్, ఎ.ఆశ్రిత, బి.తనిష్, బి.దీక్షిత్, ఎస్.తేజస్వి, హవీష్, జైసాత్విక్, పీయూష్, వరుణికా, హన్విత్, చంద్రమౌళి స్వర్ణ పతకాలు పొందారు. ఎస్.మాధవ్, ఎస్.రోహిత్ కాంస్య పతకాలు, తుషార్, రితిక్, ఇందు రజత పతకాలు కైవసం చేసుకున్నారని ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు ఎ.శ్యాంబాలాజీ తెలిపారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు

పెంటపాడు: పెంటపాడులో వేంచేసి యున్న గౌరీదేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పెంటపాడు వెలమ సంక్షేమ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా ఈనెల 27న ఆలయం వద్ద శివ కల్యాణం చేసేందుకు నిర్ణయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' షెడ్యూల్ ఇలా..

పెంటపాడు: మండలంలో పలు గ్రామాలలో ఈనెల 29 నుంచి నిర్వహించబోయే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల షెడ్యూల్‌ను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కై గాల శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ గ్రామ సభలలో వలంటీర్లు, గృహసారథులు, ప్రజలు తప్పక పాల్గొనాలని కోరారు. ఈనెల 29న బి.కొండేపాడు, 30న కోరిమిల్లి, డిసెంబర్ 1న మీనవిల్లూరు, 4న పడమర విప్పర్రు, 5న ప్రత్తిపాడు, 6న రావిపాడు, 7న పెంటపాడు-2, 8న పెంటపాడు-3, 11న వల్లూరుపల్లి గ్రామాల్లో సాయంత్రం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమాలను పార్టీ నాయకులు విజయవంతం చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని పెద్ద శివాలయం, తాలూకా ఆఫీస్ సెంటర్, వానపల్లిగూడెం, చిన్న శివాలయం తదితర ఆలయాలు వద్ద శివాలయాలు కార్తీక దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి. పౌర్ణమి నోములు ఉన్నవారు ఉదయం నుంచి ఉపవాసం ఆచరించి, సాయంత్రం శివాలయాలు కాలువ గట్లు వద్దకు చేరుకుని కార్తీక దీపం వెలగించి కాలువలోకి వదిలారు. మహిళా భక్తులతో ఆలయాలలో కిటకిటలాడాయి.

డిప్యూటీ సీఎం దృష్టికి ఎక్స్‌ప్రెస్‌ల ఆవశ్యకతను తీసుకెళ్తాం



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రత్తి వీరస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తాడేపల్లిగూడెం బస్సు కాంప్లెక్స్‌కు వచ్చేలా చూడాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కోరనున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రత్తి వీరాస్వామి, సభ్యులు తూము పార్థసారథి నిర్వహించారు. పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కాంప్లెక్స్‌లోకి రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అన్ని ప్రాంతాల్లో బస్సు స్టేషన్‌లకు ఎక్స్‌ప్రెస్‌లు వెళ్తున్నాయని, ఒక్క తాడేపల్లిగూడెంలో తప్ప అన్నారు. భౌగోళిక కేంద్రం, రెవెన్యూ డివిజన్‌గా ఉన్న పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976–77 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. అలనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు ప్రవా లక్ష్మీనరసింహమూర్తి(పీఎల్ఎన్ మాస్టార్), మునగాల వెంకట్రామయ్య, జె.మాలతి మాధవ్, పంచకర్ల చలపతిరావులను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి విద్యార్థులు హిందుస్తాన్ పెట్రోలియం సీఈఓ కె.శ్రీనివాస్, హైదరాబాద్ స్టాక్ ఎక్ఛేంజ్ సభ్యులు టి.శ్రీ, సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు, వీవీ సుబ్బారావు, పీటీ వెంకన్న, బడేటి నాగేశ్వరరావు, మెహర్, కృష్ణ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

అత్తిలి: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. అత్తిలిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ ఉమా సిద్దేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ సూర్య భగవానుడికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. గురుస్వామి ఇంటి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆలయ ప్రాంగణంలో వివిధ దేవతామూర్తులను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖర శర్మ, సిద్దేశ్వర శర్మ, సాయి ఆధ్వర్యాన పూజాదికాలు నిర్వహించారు. భారీగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లిం సోదరులు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలోని ముస్లిం సోదరులు తమకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి కోరారు. తక్షణమే స్పందించిన ఆయన శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆర్డీవో పి.చెన్నయ్యను ఆదేశించారు. ఈ మేరకు సర్వేయర్‌కు ఆర్డీవో సూచనలు ఇచ్చారు. దీంతో ముస్లిం సోదరులు మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

15 మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 15 మంది వృద్ధులకు వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి నడవలేని 15 మంది వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. బెంగళూరుకు చెందిన దండు దీప్తి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో చిన్నారులకు పోటీలు

తణుకు అర్బన్: క్రిస్మస్ సన్నాహక వేడుకల్లో భాగంగా ఆదివారం తణుకు లూథరన్ చర్చిలో నియోజకవర్గంలోని వివిధ ప్రార్థనా మందిరాలకు సంబంధించిన చిన్నారులు, బాలికలకు బైబిల్ పోటీలు, పాటల పోటీలు, వచన పఠనం అంశాల్లో పోటీలు నిర్వహించారు. తణుకు క్రిస్టియన్ యూత్ కన్వీనర్ మురాల సుధాకర్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీల్లో తమ ప్రతిభ చాటారు. పోటీల్లో విజేతలైన చిన్నారులకు వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న టీసీవై క్రిస్మస్ వేడుకల్లో బహుమతులు అందిస్తామని టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో పి.నిరీక్షణరాజు, పి.జయరాజు, బ్రదర్ మనోజ్‌బాబ్, బ్లెస్సింగ్ రాజు, పాస్టర్ బ్రెన్‌హాం, బి.లలితకుమారి, ఎలిపే శేఖర్, ఎలిపే ముఖేష్, అంబటి శ్యాంసాగర్, తలారి గంగాధర్ పాల్గొన్నారు.